క్లుప్తంగా

సుప్రీంకోర్టు నిర్ణయం ప్రభుత్వానికి చెంపపెట్టు

– మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు అక్రమ అరెస్టులో సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడం.. కూటమి ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పుపై ఆయన శుక్రవారం స్పందించారు. జర్నలిస్టులను కూడా ప్రభుత్వం ఇబ్బంది పెట్టాలని చూస్తే ఎలా అన్నారు. సీనియర్ జర్నలిస్టు కొమ్మినేనిని ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే అరెస్టు చేసిందన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మైదుకూరు : డివిజన్‌లోని ఐదు సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో డీఈఈ జె.శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. మైదుకూరులో 220 కేవీ విద్యుత్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా డివిజన్ పరిధిలోని మైదుకూరు, దువ్వూరు, చాపాడు, ఖాజీపేట, వనిపెంట సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఉదయం 8 గంటల నుంచి 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని డీఈఈ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం



పట్టణ కార్యదర్శి బాలు

బద్వేలు అర్బన్ : ప్రజా సమస్యలపై నిరంతర పోరాడుతామని సీపీఐ బద్వేలు పట్టణ కార్యదర్శిగా పెద్దులపల్లి బాలు తెలిపారు. సీపీఐ బద్వేలు పట్టణ కార్యదర్శిగా పెద్దులపల్లి బాలు రెండవ సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సీపీఐ పట్టణ 11వ మహాసభల సందర్భంగా శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన ప్రతినిధుల సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి గాలి చంద్రల సమక్షంలో 35 మందితో నూతన కౌన్సిల్, 15 మంది కార్యవర్గంతో ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లాకార్యవర్గ సభ్యులు వీరశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దస్తగిరి స్వామి పండగ



దస్తగిరి సన్నిధిలో పూజలు చేస్తున్న గ్రామస్తులు

చాపాడు : మండలంలోని సిద్దారెడ్డిపల్లెలో శుక్రవారం దస్తగిరిస్వామి పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని దర్గా వద్ద భారీ వెదురు జెండాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. 38 అడుగుల జెండాలను మంగళవాయిద్యాలతో గ్రామంలోని వీధుల వెంబడి ఊరేగించారు. ప్రతి ఇంటి నుంచి చక్కర మలీదా చదివింపులుగా తీసుకువచ్చి దర్గా దగ్గర ఉంచి స్వామి వారి సన్నిధిలో తమ కోరికలు తీర్చాలని మొక్కుకున్నారు. కోలాటం ఆకట్టుకుంది. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

శిక్షణా తరగతులు వాయిదా వేయాలి

కలసపాడు : శిక్షణా తరగతుల పేరుతో ఉపాధ్యాయులను బడులకు దూరం చేయడం సరి కాదని, వెంటనే వాయిదా వేయాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మే నెలలో పూర్తి కావాల్సిన బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పాఠశాలలు తెరిచే వరకు కొనసాగడంతో ఉపాధ్యాయులు విద్యార్థుల అడ్మిషన్లపై దృష్టి సారించలేకపోయారన్నారు. ఇంతలోనే ఇప్పుడు లీడర్ షిప్ ట్రైనింగ్ పేరుతో ప్రధానోపాధ్యాయులందరిని బడులకు దూరం చేస్తే అడ్మిషన్ల ప్రక్రియ ఎలా సజావుగా సాగుతుందో ఆలోచించాలన్నారు. బదిలీలు, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులందరూ తమ తమ కొత్త స్థానల్లో చేరి పిల్లలను బడులలో చేర్పించుకుని పాఠశాలలను బలోపేతం చేసుకునే తరుణంలో ఇలా శిక్షణ తరగతులు నిర్వహించడం ఏమిటని ప్రశ్నించారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, బ్యాగ్‌లు, యూనిఫాం, బూట్లు పూర్తి స్థాయిలో సరఫరా చేయాలని కోరారు. మన బడి – మన భవిష్యత్తును కొనసాగించి పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసేలా నిధులు విడుదల చేయాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని పేర్కొన్నారు.

అంగన్వాడీలకు వేతనాలివ్వాలి

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లాలోని 13 ప్రాజెక్టుల పరిధిలో పనిచేస్తున్న అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లకు వేతనాలు మంజూరు చేయాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.లక్ష్మీదేవి, బి.లక్ష్మీదేవి కోరారు. మీడియాతో శుక్రవారం వారు మాట్లాడుతూ 14వ తేదీ వచ్చినా జీతాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే కూరగాయల బిల్లులు, గ్యాస్ బిల్లులు ఆరునెలల నుంచి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అప్పు చేసి సెంటర్లను నిర్వహించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీలకు వేతనాలందించి, పథకాలు వర్తింపజేయాలని కోరారు.


• మోడువారిన మొక్కే.. మళ్లీ చిగురించె



ప్రకృతిలోని మొక్కలు, చెట్లు మనకు ఎన్నో జీవిత పాఠాలు నేర్పుతుంటాయి. ఒక చెట్టును మొదళ్ల వరకూ నరికేసినా మళ్లీ చిగురించి చెట్టు ఎదగడానికి దోహదపడుతుంది. అలాగే జీవితంలో కూడా ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా ఆత్మస్థైర్యం కోల్పోకుండా నిబ్బరంగా నిలదొక్కుకొని ఎదగాలనే సందేశం దీనిద్వారా నేర్చుకోవచ్చు. గండి వాటర్ వర్క్స్‌కు వెళ్లే దారిలో ఈ దృశ్యాలు కనిపించాయి.

–సాక్షి ఫోటోగ్రాఫర్, కడప

• మర్రిచెట్టుపై.. తాటి చెట్టు



మర్రిచెట్టు నీడలో మరే చెట్టు ఎదగదంటారు పెద్దలు...కానీ ఇక్కడ మర్రిచెట్టును చీల్చుకొని దానికంటే ఎత్తుకు పెరిగిన ఈ తాటి చెట్టును చూస్తే స్ఫూర్తి కలుగక మానదు. కృషి, పట్టుదల, అంకితభావం ఉంటే అసాధ్యాన్ని సుసాధ్యం చేయవచ్చని ఈ వృక్షాలు నిరూపిస్తున్నాయి. మనిషి కూడా జీవితంలో ఇలాగే పట్టుదలతో కృషి చేస్తే ఏదైనా సాధించవచ్చు. సిద్దవటం మండలంలోని మాచుపల్లి సమీపంలోని బంగళా సమీపంలో ఆ దృశ్యాలు కనిపించాయి.

–సాక్షి ఫోటోగ్రాఫర్, కడప

20న తపాలా జీవిత బీమా ఏజెంట్లకు ఇంటర్వ్యూలు

ప్రొద్దుటూరు కల్చరల్ : తపాలా శాఖలో భాగమైన గ్రామీణ తపాలా జీవిత బీమా డైరెక్ట్ ఏజెంట్లుగా ప్రొద్దుటూరు డివిజన్‌లో పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సూపరింటెండెంట్ జి.కిరణ్ ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న ప్రధాన తపాలా కార్యాలయంలో ఈ నెల 20వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై, 18 – 50 ఏళ్ల వయసు ఉన్న వారు తమ ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్, ఆధార్, పాన్ కార్డు, రెండు ఫొటోలతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. ఎంపికైన ఏజెంట్లు సెక్యూరిటీ డిపాజిట్ రూ.5 వేలు చెల్లించాలని, వారికి పాలసీలకు ప్రభుత్వం నిర్ణయించిన కమీషన్ ఇస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు ప్రొద్దుటూరు డివిజన్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ వి.సత్యనారాయణ 8498977463 ఫోన్ నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో అధికారులు

మైదుకూరు : యోగాంధ్రలో భాగంగా శుక్రవారం కడపలో జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో పాల్గొని మైదుకూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభకనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని వ్యాయామ ఉపాధ్యాయిని చంద్రావతి తెలిపారు. యోగా క్విజ్ పోటీలో షాహిద్, యోగా పోస్టర్ పోటీలో ఆర్.లహిత్, కళాత్మక యోగా పోటీలో సి.అబ్దుల్ లతీఫ్, పెయింటింగ్‌లో నాగేంద్ర, స్కిట్, రోల్ ప్లేలో ఆర్.శృంగేధర్‌లు ప్రతిభకనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు పీడీ వివరించారు. జిల్లా స్థాయిలో ప్రతిభకనబరిచిన విద్యార్థులకు కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి, డీఎస్‌డీఓ జగన్, ఆయుష్మాన్ భారత్ మెడికల్ ఆఫీసర్ మురళిబాబు బహుమతులను అందజేసినట్టు తెలిపారు.

మా కాలనీలో పాఠశాలను ఉండనీయండి సార్..!



చియ్యపాడు దళితవాడలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

చాపాడు : తమ కాలనీలో గత 40 ఏళ్లుగా ఉన్న పాఠశాలను లోపల ఊర్లోకి మార్చొద్దు సార్.. మా కాలనీ నుంచి ఊర్లో చివరన ఉండే స్కూల్‌కు వెళ్లాలంటే మాకు కష్టమవుతోందని.. దారిలో ఎలాంటి ప్రమాదం జరిగినా పట్టించుకొనేదెవరు సార్ అంటూ శుక్రవారం మండలంలోని చియ్యపాడు దళితవాడలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వేడుకున్నారు. చియ్యపాడు గ్రామంలోని బీసీ కాలనీలో ఉండే ప్రాథమిక పాఠశాలను మోడల్ స్కూల్‌గా చేయడంతో దళితవాడలోని ఎంపీపీ స్కూల్‌ను అక్కడికి విలీనం చేయడాన్ని స్థానిక దళితులు ఒప్పుకోవడం లేదు. దారిలో నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయని ఏదైనా ప్రమాదం జరిగితే తమకు ఎవరు పట్టించుకుంటారని వాపోయారు. తమ కాలనీలో స్కూల్ కొనసాగించాలని దళితులు వాపోయారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు



ఓబుళాపురంలో బండలాగుతున్న ఎద్దులు

కాశినాయన : మండలంలోని ఓబుళాపురం గ్రామంలో శుక్రవారం దస్తగిరి స్వామి ఆరాధన మహోత్సవం సందర్భంగా బండలాగుడు పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి రూ. లక్షను కడప జిల్లా మైదుకూరుకు చెందిన కుర్రా వెంకటేష్ యాదవ్ ఎద్దులు, రెండో బహుమతి రూ.70వేలు కడప జిల్లా రంగసాయపల్లెకు చెందిన మార్తల వెంకటసుబ్బారెడ్డి ఎద్దులు, మూడో బహుమతి రూ.50 వేలు ప్రొద్దుటూరు ద్వార్శల గురివిరెడ్డి ఎద్దులు, నాలుగో బహుమతి రూ.21వేలు కడప జిల్లా రంగాసయపల్లెకు చెందిన మార్తల వెంకటసుబ్బారెడ్డి ఎద్దులు, ఐదో బహుమతి రూ.20వేలు కర్నూలు జిల్లా కొత్తపల్లెకు చెందిన లక్కు నాగశివశంక్ ఎద్దులు గెలుపొందాయి. స్థానిక కార్యనిర్వాహకులు ముమ్మడి రెడ్డి వెంకటకృష్ణారెడ్డి, నాగేంద్రరెడ్డి గెలుపొందిన ఎద్దుల యజమానులకు శాలువా, పూలమాల కప్పి నగదు బహుమతులు అందించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



ప్రతిభా పురస్కారాలు అందిస్తున్న ముక్తియార్

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అంజుమన్ అహలే ఇస్లాం కమిటీ అధ్యక్షుడు వీఎస్.ముక్తియార్ పేర్కొన్నారు. స్థానిక జిన్నా రోడ్డులోని ఉర్దూ మున్సిపల్ హైస్కూల్‌లో మన ప్రజా సేవా సమితి ఆధ్వర్యంలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని భవిష్యత్తులో మంచి స్థానాల్లో నిలవాలన్నారు. మన ప్రజా సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎండీ అయూబ్ ఖాన్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు నైతిక విలువలను పెంపొందించుకోవాలని సూచించారు. ప్రతిభగల విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రతిభా పురస్కారాలు అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు అష్రఫ్, సుహాన, పరీఫాలకు వరుస బహుమతులుగా రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ బ్యాంక్ డైరెక్టర్ ఖలీల్, ప్రధానోపాధ్యాయుడు ఇమాం హుస్సేన్, విద్యాకమిటీ చైర్మన్ లాలూ, ముర్తుజా హుస్సేన్, గౌస్ లాజం, డాక్టర్ గౌస్ మొహిద్దీన్, పవన్, ఆలీ, యూసుఫ్, బాష తదితదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలకు లెప్రసీ అలవెన్స్ ఇస్తాం



జేసీకి వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : నిధులు విడుదల కాగానే రెండు, మూడు రోజుల్లో ఆశా కార్యకర్తలకు లెప్రసీ అలవెన్స్ ఇస్తామని లెప్రసీ జిల్లా అధికారి హామీ ఇచ్చారు. కడప కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్ల రిలే నిరాహార దీక్షలు శుక్రవారం విరమించారు. ఈ సందర్భంగా జిల్లా శ్రామిక మహిళా కన్వీనర్ విజయలక్ష్మి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యాదర్శులు వేణుగోపాల్, నాగసుబ్బారెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ.బాదుల్లా మాట్లాడుతూ ఆశా వర్కర్ల రిటైర్‌మెంట్ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. గ్రాట్యూటీ ఇవ్వాలని, మెటర్నటీ లీవ్ అమలు చేస్తూ జీఓ జారీచేయాలని కోరారు. జీఓలు జారీ అయ్యేంత వరకు ఆశా వర్కర్లను రిటైర్‌మెంట్ ఇవ్వరాదని, ఎక్కడైనా చేస్తే జీఓ వచ్చాక మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం మెరుగైన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నరసమ్మ, శాంతమ్మ, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

సమాజాన్ని తట్టిలేపే ఆయుధం ప్రజాకళ



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య

బద్వేలు అర్బన్ : సమాజాన్ని తట్టిలేపే ఆయుధం ప్రజాకళలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య పేర్కొన్నారు. సీపీఐ జిల్లా, రాష్ట్ర మహాసభలు త్వరలో జరగనున్న నేపథ్యంలో శుక్రవారం ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి నగర్‌లో నిర్వహించిన ప్రజానాట్యమండలి 5 రోజుల రాష్ట్రస్థాయి శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలక ప్రభుత్వాలు అనుసరించే ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో వీధినాటకాలు, పాటలు రూపొందించి ప్రజలను చైతన్యపరచి ప్రతిఘటనోద్యమానికి సిద్ధమవుతామని ప్రకటించారు. ప్రజానాట్యమండలి వంటి సంస్థలు ప్రజల అభ్యుదయానికి ఒక దీప స్తంభంగా నిలబడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, ప్రజానాట్యమండలి రాష్ట్ర, జిల్లా నాయకులు రామకృష్ణ, పి.చంద్రశేఖర్, పల్లవోలు రమణ, వీరశేఖర్, వర్మ, అనంత లక్ష్మి, వెంకట రమణ, బాలఓబయ్య, ఇమ్మానియేలు, పి.వి.రమణ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీపై దృష్టి సారించాలి



ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్

చాపాడు : విద్యార్థులకు ఇంజనీరింగ్ విద్యను అందించే క్రమంలో అధ్యాపకులు డిజిటల్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీపై దృష్టి సారించాలని ఎన్ఐటీటీఆర్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ ప్రొఫెసర్ పి.మల్లిక తెలిపారు. స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ)లో ఐదు రోజులుగా చైన్నైకి చెందిన ఎన్ఐటీటీఆర్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఎడ్యుకేషన్ టెక్నాలజీ ప్రొఫెసర్ బి.యోగమీణ పర్యవేక్షణలో నిర్వహించిన ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మల్లిక మాట్లాడుతూ అధ్యాపకులు డిజిటల్ టెక్నిక్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీ మీద అవగాహన కల్పించుకోవాలన్నారు. అధ్యాపకులు నైపుణ్యాన్ని పెంచేవిధంగా ఆధునిక సాంకేతికతను, కమ్యునికేషన్ స్కిల్స్, లర్నింగ్ స్కిల్స్‌పై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలన్నారు. విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురి కాకుండా ఉత్సాహంగా చదువు పట్ల ఆసక్తి కలిగేలా విద్యా బోధన ఉండాలని సూచించారు. ఇదే క్రమంలో డిజైన్ థింగ్స్‌పై అధ్యాపకుల పలు సూచనలు, సలహాలు తెలియజేశారు. కార్యక్రమంలో సీబీఐటీ డైరెక్టర్ అడ్మిన్ జి.శ్రీనివాసులరెడ్డి, ప్రిన్సిపాల్ ఎస్.శృతి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు

గోపవరం : మండలంలోని పి.పి.కుంట గ్రామానికి సమీపంలో సెంచూరీ ప్లైవుడ్ పరిశ్రమ పక్కనే ఉన్న జగనన్న కాలనీలో వేసిన ఆక్రమణలను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు త్వరలోనే తొలగిస్తామని తహసీల్దారు త్రిభువన్‌రెడ్డి శుక్రవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వం నవరత్నాలలో భాగంగా పేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్న ఉద్దేశంలో గోపవరం రెవిన్యూ పొలం 1,562 ప్రభుత్వ స్థలాన్ని జగనన్న కాలనీకి కేటాయించారు. మొదటి విడతలో 12 మంది లబ్ధిదారులకు ఇళ్లు కూడా మంజూరు కాగా అవి పూర్తి చేయడం జరిగింది. ఇదే కాలనీలో మరో 70 మందికి బేతాయపల్లె సచివాలయం పరిధిలోని ఇళ్లు లేని నిరుపేదలకు స్థలాలు మంజూరు చేసి పట్టాలు ఇచ్చారు. సదరు పట్టాలను లబ్ధిదారుల పేరు మీద రిజిస్ట్రేషన్ కూడా చేయడం జరిగింది. ఇంతలో సాధారణ ఎన్నికల కోడ్ రావడంతో లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను చేపట్టలేకపోయారు. 200 మందికి పైగా స్థానికేతరులు జగనన్న కాలనీలో అక్రమ గుడిసెలు వేయించారని తెలిపారు. అయితే పట్టాలు పొందిన వారు తమకు కేటాయించిన స్థలాలలో గుడిసెలు వేశారని వాటిని తొలగించి మా స్థలాలు తమకు కేటాయించాలని అనేకమార్లు జిల్లా కలెక్టర్, బద్వేలు ఆర్డీవో కార్యాలయం, స్థానిక తహశీల్దారు కార్యాలయంలో ఫిర్యాదులు చేశారు. పలుమార్లు రెవిన్యూ అధికారులు గుడిసెలు తొలగించేందుకు వెళ్లగా అక్కడ ఉన్నవారు ఎదురుదాడికి దిగుతుండడంతో ఏమి చేయలేక వెనుతిరగాల్సిన పరిస్థితి రెవిన్యూ అధికారులకు ఏర్పడింది. ఈ నేపథ్యంలో గుడిసెవాసులు హైకోర్టును ఆశ్రయించగా తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు యథాస్థితి కొనసాగాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే కోర్టు నిబంధనల మేరకు తిరిగి ఎలాంటి కట్టడాలు నిర్మించకూడదని చెప్పినప్పటికి యథేచ్ఛగా అక్రమ కట్టడాలు నిర్మిస్తుండడంతో అనేక మార్లు అడ్డుకున్నామని తహశీల్దారు తెలిపారు.

క్యూఆర్ కోడ్‌తో ఇళ్ల పట్టాలు

ఆర్డీవో చంద్రమోహన్



వృద్ధురాలికి క్యూఆర్ కోడ్‌తో తయారు చేసిన అనుబంధ పత్రాన్ని అందచేస్తున్న ఆర్డీవో

బద్వేలు అర్బన్ : బద్వేలు పట్టణంలో నకిలీ పట్టాల బెడద అధికంగా ఉన్న నేపథ్యంలో ఇకపై లబ్ధిదారులకు ఇచ్చే పట్టాలు, అనుబంధ పత్రాలు క్యూఆర్ కోడ్‌తో ఇవ్వడం జరుగుతుందని ఆర్డీవో ఎ.చంద్రమోహన్ పేర్కొన్నారు. బద్వేలు డివిజన్ పరిధిలో మునుపెన్నడూ లేని విధంగా నకిలీ పట్టా తయారు చేసేందుకు వీలులేకుండా ప్రయోగాత్మకంగా రూపొందించిన అనుబంధ పత్రాన్ని శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో భైరవపు సుశీలమ్మ అనే వృద్ధురాలికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకపై బద్వేలు మున్సిపాలిటీతో పాటు ఆయా మండలాల్లో జారీ చేసే ఇంటి పట్టాలు, అనుబంధ పత్రాలు క్యూఆర్ కోడ్‌తో ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ విధానం ద్వారా సంబంధిత స్థలం యొక్క లబ్ధిదారుని పూర్తి వివరాలు, స్థలం ఉన్న ప్రాంతం, స్థలానికి సంబంధించి లేఅవుట్ క్యూఆర్ కోడ్ సహాయంతో తెలుసుకోవచ్చని తెలిపారు. ఈ విధానం ద్వారా సంబంధిత పట్టాను, అనుబంధ పత్రాన్ని ఎవ్వరూ కూడా నకిలీని సృష్టించలేరని తెలిపారు. కార్యక్రమంలో బద్వేలు తహశీల్దారు ఉదయభాస్కర్‌రాజు, ఆర్డీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్కిటెక్చర్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్‌ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఏఐఎస్ఎఫ్ఐ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : కడప వైఎస్సార్ ఆర్కిటెక్చర్ విశ్వవిద్యాలయ విద్యార్థుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి.వలరాజు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట శుక్రవారం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సీఓఏ పర్మిషన్ ఇప్పించాలని కోరారు. కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్ అనుమతి లేకపోయినా విద్యార్థులతో అడ్మిషన్లు చేయించారన్నారు. ఐదేళ్ల కాలం పూర్తయిన పది రోజుల్లో ఫైనల్ పరీక్షలు ఉన్నప్పటికీ సీఓఏ అనుమతి ఇంతవరకూ రాకపోవడం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాట మాడటమేనని విమర్శించారు. వైస్ ఛాన్సలర్ విశ్వనాథ్ నిర్లక్ష్యంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, భవనాలకు అద్దె చెల్లిస్తున్నప్పటికీ వైస్ ఛాన్సలర్, కాంట్రాక్టర్‌కు మధ్య సమస్యలు రావడంతో హాస్టల్ ఖాళీ చేయాలని విద్యార్థులను ఆదేశించడం సరికాదన్నారు. టీజింగ్ ఫ్యాకల్టీని రెన్యూవల్ చేయకపోవడంతో తరగతులు బోధించే వారే కరువయ్యారన్నారు. కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్ అనుమతి లభించకపోతే ఐదేళ్ల డిగ్రీ చిత్తు కాగితంతో సమానమవుతోందన్నారు. విద్యాశాఖమంత్రి నారా లోకేష్ సీఓఏ అనుమతి తక్షణమే మంజూరుచేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి అరుణ్‌కుమార్, యూనివర్శిటీ విద్యార్థి నాయకులు సాయికృష్ణ, రామాంజనేయులు, సుష్మ,సింధు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి బ్యాంకు ఖాతాకే తల్లికి వందనం

కడప రూరల్ : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎస్సీ విద్యార్థి బ్యాంకు ఖాతాలకే తల్లికి వందనం నిధులు జమవుతాయని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సరస్వతి తెలిపారు. ఎస్సీ విద్యార్థులు సమీప పోస్టాఫీసులో బ్యాంకు ఖాతా తెరచి, మీ ఆధార్ నెంబర్‌కి ఎన్‌పీసీఐ పోర్టల్‌కు లింకు చేసుకోవాలని పేర్కొన్నారు. ఒకవేళ విద్యార్థికి ఇదివరకే బ్యాంకు ఖాతా ఉన్నట్లయితే ఆ అకౌంట్‌కు ఎన్‌పీసీఐ లింక్ చేసుకోవాలని తెలిపారు. అలాగే 9, 10వ తరగతి చదువుతున్న విద్యార్థి తల్లి బ్యాంకు ఖాతాలకు తల్లికి వందనం నిధులను విడుదల చేస్తారన్నారు. కావున తల్లులు తమకు ఉన్న బ్యాంక్ అకౌంట్‌కు వెంటనే ఎన్‌పీసీఐకు లింకు చేసుకోవాలన్నారు. అకౌంటు లేనివారు తమ సమీపంలోని పోస్ట్ ఆఫీస్‌లో, లేదా బ్యాంకులో ఖాతా తెరచి ఆధార్ నెంబర్‌కు ఎన్‌పీసీఐ పోర్టల్‌కు లింక్ చేసుకోవాలని తెలిపారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నముక, నరాలు, తిమ్మిర్లు, వంటి ఒళ్లు నొప్పులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. ప్రముఖ క్యాన్సర్ వ్యాధి నిపుణురాలు డాక్టర్ డి.నిహారిక క్యాన్సర్ అవగాహన మరియు స్క్రీనింగ్, క్యాన్సర్ రోగులను క్రమ తప్పకుండా అనుసరించడం మరియు ఇతర క్యాన్సర్ సంబంధిత సంప్రదింపులు ఉంటాయన్నారు. ఈ నరాల, గుండెజబ్బుల, క్యాన్సర్ సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే ఆసుపత్రిలో నూతనంగా డయాలసిస్ సెంటర్ ప్రారంభించడం జరిగిందని, కిడ్నీ సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

సబ్ జైలు ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా గంగాధర్



పులివెందుల రూరల్ : పులివెందుల సబ్‌జైలు ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డి.గంగాధర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కొండాపురం మండల నివాసి అయిన డి.గంగాధర్ 2018లో ఎస్ఐగా ఎంపికై మొదటిగా గుంటూరు జిల్లాలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పలు చోట్ల పనిచేస్తూ కమలాపురం సబ్‌జైలు సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు. గతంలో ఉన్న పులివెందుల సబ్ జైల్ సూపరింటెండెంట్ అయ్యవారురెడ్డి బదిలీ అయ్యారు.

ఘనంగా జాతీయ కుట్టు మిషన్ దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న నిర్వాహకులు

పోరుమామిళ్ల : స్థానిక మదర్ థెరెసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్రయాన్స్ టైలరింగ్ సెంటర్‌లో శుక్రవారం జాతీయ కుట్టుమిషన్ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రోజిలీనా, ఓఎల్ఎఫ్ హెడ్మాస్టర్ ఆరోగ్యరాణి కేక్ కట్ చేసి శిక్షణ పొందుతున్న మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. టైలరింగ్ వృత్తిగా జీవిస్తున్న వారికి కుట్టుమిషన్ చాలా ముఖ్యమైన సాధనమని రవిప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. సెంటర్‌లో కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలు కుట్టుమిషన్‌ను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్ట్రక్టర్ పారిజాన్, డాక్టర్ అమితారెడ్డి, టీచర్ రాజారెడ్డి పాల్గొన్నారు.

15న తొగటవీర క్షత్రియ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

కడప కల్చరల్ : పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన తొగటవీర క్షత్రియ కుల విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేయనున్నట్లు తొగటవీర క్షత్రియ సంక్షేమ సంఘం కడప నగర శాఖ అధ్యక్షుడు కళ్యా సుధాకర్, ప్రధాన కార్యదర్శి పల్లా నరసింహారావు తెలిపారు. సంఘం కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 15న ఆదివారం ఉదయం పది గంటలకు పాత రిమ్స్‌లోని బీసీ భవన్‌లో కార్యక్రమం జరుగుతుందన్నారు. 2024–25 సంవత్సరానికి పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి అత్యధిక మార్కులు సాధించిన 59 మంది విద్యార్థులకు నగదు పురస్కారాలు, ప్రశంసా పత్రాలు, జ్ఞాపిక అందజేస్తున్నామన్నారు. నగర పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల్లో అత్యధిక మార్కులు సాధించిన 12 మంది విద్యార్థులకు మెడల్స్, ప్రశంసా పత్రాలు, జ్ఞాపిక బహుకరిస్తున్నామన్నారు. తొగటవీర క్షత్రియ కుల బాంధవులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఉమ్మడిశెట్టి సుబ్రహ్మణ్యం, ఆర్గనైజింగ్ కార్యదర్శి పల్లా మురళీకృష్ణయ్య, కోశాధికారి టేకూరి సుదర్శన్, ఉపాధ్యక్షుడు చౌడంసూరి బాబు, బొలిశెట్టి వెంకటస్వామి, పల్లా బాల చౌడన్న, దొండ్ల వెంకటరమణ పాల్గొన్నారు.

అవగాహన కల్పించాలి

పెండ్లిమర్రి : ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకం గురించి గృహ వినియోగదారులకు అవగాహన కల్పించాలని ట్రాన్స్‌కో డీఈ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం మండలంలోని మిట్టమీదపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పీఎం సూర్య ఘర్ యోజన పథకం గురించి వినియోగదారులకు, సోలార్ గుత్తేదారులకు, సిబ్బందికి అవగాహన సమావేశం నిర్వహించారు. ఇంజనీర్లు పాల్గొన్నారు.